కథ

# పట్టుచీర

- పి.వి. శేషారత్నం

'సర్ ఓ చిన్న మాట.'

నా వెనకాల నుంచి సన్నగా గుసగుసలా వినబడింది.

అటూ ఇటూ చూశాను.

ఆ రోడ్డు మీద జనం పల్చగా ఉన్నారు. గోల్డ్ కలర్ సఫారీ డ్రెస్. చేతికి రెండుంగరాలు. మెళ్లో సన్నని బంగారు చైన్, కళ్లకి బరువైన గాగుల్స్. ఆ క్షణాన ఇలాంటి రూపం నాకు తప్ప ఆ రోడ్డు మీద ఎవరికీ లేదు. అంచేత ఆ 'సర్' పిలుపు నాకే అయి ఉండాలని వెనక్కి తిరిగాను. బక్కపల్చగా ఉన్నాడా వ్యక్తి - చేతిలో రెండు పాలిథిన్ సంచులు - వేసుకున్న డ్రెస్ పెద్ద ఖరీదైనదేం కాదు. నేను తనకేసి చూడడం గమనించి - 'సర్ పట్టుచీరలున్నాయి - కావాలా?' అన్నాడు.

నాకు ఒళ్లు మండింది. వాడి కంటికి నేనెలా కనిపిస్తున్నాను? అసలే లాస్ట్ బస్‌కి టైమయిపోయి పరిగెడుతున్నాను. హైద్రాబాద్‌కి మీటింగ్ వుండి వచ్చాను. అది అయ్యేసరికి ఏడయిపోయింది. అందులో వాళ్లిచ్చిన టీ బిస్కెట్లు నా ఆకలిని మరింత చేశాయి. అందుకే బయట పడి హడావుడిగా బస్టాండ్‌కి దగ్గర్లో వున్న హొటల్లో దూరాను.

ఈ టిఫిన్ కడుపులో పడకపోతే నాకీ రోజుకి పస్తే. బస్సెక్కితే మర్నాడు ఉదయం తొమ్మిదికి గాని ఊరు చేరలేను. వెళ్లగానే స్కూలు - హడావిడి. బస్సుకింకా పావుగంట టైముంది. ఓ కారా కిళ్ళీ కట్టించుకుని బస్సెక్కితే హాయిగా కునుకు తియ్యొచ్చు. బస్సు కుదుపులు - ఊయల్లో పసిపిల్లాడిని జో కొట్టినట్టు అలవాటయిపోయాయి నాకు తరచు మీటింగులకి ఊళ్లు తిరగడం - అవగానే ఉరుకులూ పరుగులతో మర్నాడు ఉద్యోగానికి హాజరవడంతో - అలా హడావుడిగా కిళ్లీ నముల్తూ పరిగెడుతున్నట్టు నడుస్తున్న నన్ను ఓ సన్నాసి 'పట్టుచీర కావాలా' అంటే ఒళ్లు మండదూ?

'సర్ ఏమీ అనుకోకండి - పరిస్థితులు బాగాలేక పట్టుచీర అమ్ముకోవలసి వచ్చింది.' ఆ వ్యక్తి కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

'పట్టుచీరలమ్మేవాడికి పరిస్థితి బాగా లేకపోవడమేమిటి?' ఆశ్చర్యంతో ఆగాను అరనిమిషం.

'ఒక్కో చీర రెండు వేలకి తక్కువ వుండదు సర్ - కాని మీకు కాబట్టి పదిహేను వందలకిస్తాను' అంటూ సంచీలోంచి ఓ పట్టుచీర తీసాడు. కళ్లు చెదిరిపోయాయి.

చిలకాకు పచ్చరంగుకి మిరప పండు జరీ బోర్డర్. ఇది కట్టుకుంటే యమున అప్సరసలా మెరిసిపోతుంది. చీరకేసి చూస్తున్న నా వీక్‌నెస్ పట్టేసాడతగాడు.

'మీరిది మంచిదా కాదా అని సందేహించనక్కరలేదు. అసలైన పట్టు - చూడండి' అంటూ ఓ దారం పోగు నమిలి చూపించాడు, మరో పోగు నా చేతిలో పెట్టి. రంగు పోలేదు - కాని నాదగ్గర డబ్బు లేదన్న విషయం వాడికెలా అర్థమవుతుంది - చేతిలో బ్రీఫ్‌కేసు - సఫారీ, ఉంగరాలు, గొలుసు చూసి నాదగ్గర బాగా డబ్బుంది అనుకుని వుంటాడు. నిజానికి ఉండేదే. కాని చిట్టిగాడి పుట్టినరోజు రేపు - పార్టీకి అన్ని ఏర్పాట్లు చెయ్యమని - వాడికి బట్టలు కొనమని యమునకి డబ్బిచ్చేసాను. హైద్రాబాద్‌లో నాకేం ఖర్చుంటుంది కనుక - పొద్దున బండి దిగి మీటింగ్‌కెళ్లి రాత్రి బస్సెక్కడం - మధ్యాహ్నం ఓ పూట భోజనం - అందుకే ఈసారి చేతిలో డబ్బేం లేదు. కాని భలే ఛాన్సు పోతోందే.



ఆలోచనలలో ఉన్న నాకు అతగాడి మాట వినిపించింది.

'సర్ పట్టుచీర కావాలా?' ఎవరినో అడుగుతున్నాడు. అవతలి వ్యక్తిది గిరిజాల జుట్టు.

'ఏం నీకెలా కనిపిస్తున్నాను. అసలు నేనెవరో తెలుసా?' అన్నాడు గిరిజాల వాడు. బక్కపలచ వ్యక్తి భయపడ్డట్టు కనిపించాడు. నాకూ భయం పట్టుకుంది. ఏ పోలీసునో అని చెప్పి ఆ చీరలు కాస్తా వాడు కొట్టేస్తే - కలిసొచ్చే అదృష్టం చేజారిపోతుంది. యమున ఎన్నాళ్లనుంచో పట్టుచీర కొనమని పోరు పెడుతోంది. ఏ నెల కానెల ఏవో ఖర్చులు. ఇప్పుడీ పట్టుచీర బేరమాడితే వెయ్యి రూపాయల కిచ్చేస్తాడు. కాని ఎలా?

ఇంతలో గిరిజాల వాడు నవ్వి -

'పోలీసును కాదు లేవోయ్ - 'అపర్ణ బ్రదర్స్ పట్టు చీరల షోరూం' పేరు విన్నావా? అందులో పనిచేస్తున్న వాడిని.' అన్నాడు.

'అయితే మీరేమంటారు?' - నిరాశ ధ్వనించింది బక్కపలచవాడి కంఠంలో.

'కొనకపోయినా నాణ్యత చెప్పగలను. ఏదీ పచ్చచీర చూడనీ' అన్నాడు.

చీరను నాలుగువైపులా తిప్పి చూసాడు - నావైపు చూసి -

'ఈ చీర మీరు కొందామనుకుంటున్నారా?' అన్నాడు అదోలా మొహం పెట్టి.

'నాదగ్గర గొలుసు, ఉంగరం తప్ప డబ్బుల్లేవు' అన్నాన్నేను.

'అసలైన పట్టు సర్' అన్నాడు బక్కపలచవాడు.

'ఇతను చెప్పింది నూటికి నూరుపాళ్లు నిజం - ఇది రెండు వేలకి తక్కువ వుండదు కాని దొంగ సొమ్ములా వుంది. తొమ్మిదొందలకి బేరం ఆడదాం' అన్నాడు నా చెవిలో గిరిజాలవాడు.

నా మొహం చింకి చేటంత యింది.

కాని...

నా మనసు నోరు నొక్కేశాను.

'ఇది తొమ్మిది వందలకివ్వొచ్చు' అన్నాడు గిరిజాల వాడు.

'అన్యాయం సర్ ఏదో నా అవసరానికి అమ్ముకుంటున్నానని మరీ అంత తక్కువకి....'

గిరిజాల వాడు అతన్ని మాట్లాడనీయలేదు.

'నీకిష్టమైతే తొమ్మిది వందలకి మేష్టారికిచ్చేయ్ - మా యింటిదాకా వస్తే మిగిలిన నాలుగు చీరలు నేను తీసుకుంటాను' అన్నాడు.

సడన్‌గా బస్సు టైమయిపోతోందని గుర్తొచ్చింది. చీరల మీంచి దృష్టి మరల్చి నాలుగడుగులు వేసాను.

'చీర తీసుకోండి సర్ - డబ్బులిచ్చెయ్యండి' అంటూ హడావుడిగా పాలిథిన్ కవరుతో సహా చేతిలో పెట్టి చెయ్యి చాపాడు.

'డబ్బుల్లేవన్నాగా?'

నా ప్రాణం మాత్రం లాగుతోంది. యమున - ఆకు

పచ్చ పట్టు చీరలో - అందంగా - నా మెడచుట్టూ సుతారంగా చేతులు చుట్టి.....

'పోనీ చైన్ ఇవ్వండి సర్ -'

ఒక్క క్షణం ఒకే క్షణం ఆలోచించాను.

'పావుతులం చైన్ - పన్నెండొందలు...' అనుకుంటూ అతని చేతిలో పెట్టడమేమిటి, చిల్లర కూడా యివ్వకుండా అతను పరుగెత్తుకు వెళ్లడమేమిటి చిటికెలో జరిగాయి.

నేనెక్కాల్సిన బస్సు వెతుక్కుంటున్నాను.

'సర్!' మరో వ్యక్తి పరుగెత్తుకుని వచ్చాడు. పిల్లి గడ్డం.

'మీరు త్వరగా బస్సెక్కండి. అతన్ని పోలీసులు పట్టుకున్నారు' అతని గొంతు గాభరాగా ఉంది.

'మీరెవరు?'

'మీలాంటివాడినే - నేను కొన్న చీర కిళ్లీ కొట్టులో దాచాను. మీరు కొనడం చూసి పరుగెతుకొచ్చి చెప్తున్నాను.'

నా గుండె గుభేలుమంది

బాబోయ్ దొంగ సొమ్ము కొనడం కూడా నేరమే. ఇప్పుడీ పోలీసు గోలలో చిక్కితే - నా పరువు - ప్రతిష్ట....

ఒక్క అంగలో కదుల్తున్న బస్సెక్కేసాను.

నా చేతిలో సూట్కేసు, లోపలున్న వ్యక్తి అందుకున్నాడు. సీటులో కూర్చున్న పది నిమిషాల దాకా నా గుండె స్పీడుగా కొట్టుకుంటూనే వుంది.

'ఏమిటండీ పరిగెత్తుకొచ్చారా? అంత ఆయాస పడుతున్నారు' పక్కసీట్లో పెద్దాయన అడిగాడు.

'అవునండీ' అంటూ అపురూపంగా పాలిథిన్ కవరు నా గుండెలకి హత్తుకున్నాడు.

ఓసారి తనివితీరా చీర చూసుకోవాలనుకున్నాను. పాలిథిన్ కవర్లోంచి చీర బయటికి తీసి చూసి నిశ్చేష్టుడనై పోయాను.

అది నాకు చూపించిన పట్టుచీర కాదు.

నన్ను హడావిడిలో పెట్టి ఎంత మోసం చేశాడు.

ఆ చీర వంద రూపాయలు కూడా చెయ్యదు.

అదే రంగు - అదే అంచు - కాని ఆ పట్టుచీర మాత్రం కాదు. చేతిలో చీరతో మిడిగుడ్లేసుకు కూర్చున్న నన్ను పక్కాయన పలకరించాడు -

'మీ ఆవిడకి చీర కొన్నారా? ఓహో పట్టుచీరేనా?' అన్నాడు.

'అసలేం జరిగిందంటే -'

నా మనసులో బాధ ఎవరితోనయినా పంచుకోకపోతే నా గుండె పేలిపోతుంది - పావుతులం సన్నని చైన్...

'ఏం జరిగిందో నేను చెప్పనా?' అన్నాడాయన.

విచిత్రంగా చూసానాయన వైపు.

'మీకెలా తెలుసు?'

'ఒకతను చీరలమ్ముతానని వచ్చాడు. నాలుగడుగులు వెయ్యగానే మరొకడు చీరల షాపులో పనిచేసే వాడిని అంటూ దాని వెల కట్టి మీకు చవగ్గా ఇప్పించాడు. బస్సెక్కే ముందు మరొకడు వచ్చి చీరలవాడిని పోలీసులు పట్టుకున్నారని తొందరపెట్టి కదిలే బస్సు ఎక్కించాడు. తీరా బస్సెక్కాక చూస్తే అది పట్టుచీర కాదు - నకిలీ పట్టు - అంతేగా జరిగింది...'

నాకు మాట రాలేదు.

ఆయన నవ్వాడు.

'మేస్టారూ! ఈ ఊళ్లో ఇది మామూలే - మనలాంటి వాళ్లు ఆశతో బుట్టలో పడటమూ సామాన్యమే - రెండు నెలల క్రితం సరిగ్గా - నాకూ ఇలాగే జరిగింది - అందుకే చెప్పగలిగాను. అప్పట్నుంచీ నేనిలాంటి వస్తువులు కొంటే ఒట్టు - బ్రాహ్మణుడు - నల్లమేక కథలా వుంది కదూ!'

* * *

ఏ విషయమూ నాకు యమున దగ్గర దాచటం అలవాటు లేదు - అందుకే మాయిద్దరి మధ్యా పొరపొచ్చాలు లేవు.

ఇంటికెళ్లగానే ఆముదం తాగిన ముఖం పెట్టి జరిగిందంతా చెప్పాను.

'యమునా! ఇదంతా నిన్ను పట్టుచీరలో చూసుకోవాలనే ఆశతో....'

నా మాట పూర్తి కాకుండానే తుఫాను వచ్చినట్లు పెద్దపెట్టున నవ్వడం మొదలుపెట్టింది యమున.

నాక్కోపం వచ్చింది. అసలు కోపం రాకూడదు. యమున నన్ను చీవాట్లు పెట్టనందుకు - ఆనందం కలగా - యమున చెప్పిన విషయం విన్నాక నాకూ నవ్వాగలేదు.

'అయ్యో తానొకటి తలిస్తే దైవమొకటి తలిచాడు అంటారు - మీరస్తమానూ హైద్రాబాద్ మీటింగులకి పగలనక, రాత్రనక ప్రయాణాలు చేస్తూంటారని నాకు ఒకటే బెంగ. బంగారం వేసుకో వద్దంటే మీరు బాధ పడ తారు. అందుకే నేను అచ్చం మీ చైన్ - ఉంగరాల్లాంటివే రోల్డ్గోల్డ్వి కొన్నాను. మీరు ఊరు వెళ్లేటప్పుడు అవే మీకిస్తున్నాను.'

నాకు బక్కపలచవాడు - గిరిజాలవాడు - పిల్లిగడ్డం వాడు గుర్తొచ్చారు.

వాళ్లా చైన్ ఏ బంగారు షాపులోకో తీసికెళ్తే...

అప్పుడు వాళ్లు మొహాలు....

'ఎంత లేదన్నా ఈ చీర నూట పాతిక రూపాయలుంటుంది. చైన్ పాతిక రూపాయలు - అంటే వంద రూపాయలు మనకే లాభం' యమున లెక్కలేస్తోంది.

కాని నా మెదడులో మరో ఆలోచన పుట్టింది. ఆ రోజు నాదగ్గర డబ్బులుండి వుంటే....

ఆ ఆలోచనని యమునకి చెప్పకుండా నా మనసులోనే ఉంచి సీల్ వేసాను.

## జాతీయ సమైక్యతా అవార్డు అందుకున్న పారిశ్రామికవేత్త

# ప్రేమలత



న్యూఢిల్లీలోని 'అఖిల భారత జాతీయ సమైక్యతా సంస్థ' ప్రతి సంవత్సరం వివిధ రంగాలలో ఎనలేని కృషి చేసిన వారికి 'జాతీయ సమైక్యతా అవార్డు'లను బహూకరిస్తూ వస్తోంది.

ఈ అవార్డును అందుకున్న ప్రముఖులలో తమిళనాడు ముఖ్యమంత్రి కుమారి జయలలిత, అక్కినేని నాగేశ్వరరావు, సత్యజిత్రే, భీష్మనారాయణ సింగ్, మల్లికా సారాభాయ్ ప్రభృతులున్నారు.

1995 సంవత్సరానికి ప్రకటించిన అవార్డులలో వ్యాపార రంగంలో విశేష సేవలందించినందుకు గుర్తింపుగా మన రాష్ట్రానికి చెందిన శ్రీమతి యస్. ప్రేమలత, కేంద్ర మంత్రి శ్రీ కృష్ణ కుమార్ వద్దనుంచి ఈ 'జాతీయ సమైక్యతా అవార్డు'ను అందుకున్నారు.

1942లో సిద్దంశెట్టి రాజేశ్వరరావు దంపతులకు జన్మించిన ప్రేమలత బియస్సీ. బియిడి వరకు చదివారు. 1965లో రాధాస్వామి గారితో ఈమె వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. అపర్ణ, దీప్తి.

ప్రారంభంలో ఈ దంపతులు ఉపాధ్యాయ వృత్తిని చేపట్టినా క్రమంగా రియల్ ఎస్టేట్, వస్త్ర వ్యాపారం, సూపర్ మార్కెట్, హోటల్ పరిశ్రమ అంటూ వివిధ రంగాలకు తమ వ్యాపార పరిధిని పెంచారు. ప్రస్తుతం వీరు నూరు కోట్ల రూపాయల పెట్టుబడితో టెలివిజన్ సెట్లను ఉత్పత్తి చేసే కర్మాగారాన్ని విశాఖపట్టణంలో నెలకొల్పనున్నారు. వీరి కంపెనీలలో మహిళలే అధిక సంఖ్యలో పనిచేస్తూండటం విశేషం!

ప్రేమలత వివిధ విద్యా సంస్థలలోనూ, లయన్స్ క్లబ్ లోనూ సభ్యురాలిగా వున్నారు. వ్యాపార రంగంలో మహిళల ప్రాధాన్యత ఇంకా ఎంతో పెరగాల్సి వుందని చెప్తున్న ప్రేమలత, విజ్ఞాన జ్యోతి కాలేజీ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంటు వారి ఎం.బి.ఎ. కోర్సులో ప్రథమస్థానంలో వచ్చినవారికి బంగారు పతకాన్ని అవార్డుగా ప్రవేశపెట్టారు.

ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ 'ఇంటర్నేషనల్ లివింగ్ ఆర్గనైజేషన్' హైద్రాబాద్ బ్రాంచికి ప్రేమలత, రాధాస్వామి ఆధిపత్యం వహిస్తున్నారు.

ఇటు విద్యారంగంలో, అటు పారిశ్రామిక రంగంలో ఎనలేని సేవలందిస్తున్న ప్రేమలతకి సమాజ సేవాకార్యక్రమాలను చేపట్టాలనేది జీవిత లక్ష్యం.

\- లలితాకృష్ణ